
సాక్షి జగిత్యాల

సోమవారం ; 10 ; ఏప్రిల్ ; 2023



భక్తుల పుణ్య స్నానాలు

ధర్మపురి: ధర్మపురి పుణ్యక్షేత్రంలోని పవిత్ర గోదావరిలో ఆదివారం భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. గంగమ్మ గౌరమ్మకు మొక్కులు చెల్లించారు.



మల్లన్న సేవలో రాజేశంగౌడ్

కోరుట్ల: రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ గొడిశెల రాజేశంగౌడ్–శ్యామల దంపతులు ఆదివారం కొమురవెల్లి మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
37.0/24.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పడప్పుడు మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

పొరుగువాడు ఆకలితో బాధపడుతుంటే తాను కడుపునిండా భుజించే వ్యక్తి విశ్వాసి కాజాలడు.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
సోమ 6.34	మంగళ 4.37

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

ఘనంగా సంకటహర చతుర్థి



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని మహాగణపతి ఆలయంలో ఆదివారం సంకటహర చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, ముత్యాలశర్మ మంత్రోచ్ఛారణలతో స్వామివారికి అభిషేకం, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

రేపు మహాత్మా జ్యోతిబాపూలే జయంతి

జగిత్యాలటౌన్: మహాత్మా జ్యోతిబాపూలే 197వ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా అధికారుల కాంప్లెక్స్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాయిబాబ ఆదివారం ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల సంఘాల నాయకులు, జిల్లా అధికారులు పాల్గొనాలని కోరారు.

భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న సభ్యులు

ధర్మపురి: శోభకృత్ నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని ధర్మపురి పట్టణంలో లోక కల్యాణార్థం భగవద్గీత ప్రచార గ్రంథాలను పంపిణీ చేశారు. త్రైత సిద్ధాంతకర్త ప్రబోధానంద యోగీశ్వరుల వారి దివ్య ఆశీస్సులతో సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక కమలాపూర్ రూట్‌లో ఇంటింటా భగవద్గీత ప్రచారం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు రాజు, రాకేష్, ఎం.రాజు, విక్రమ్ దీక్షిత్, సునీత, రవళి, స్వాతి, అనుతేజ్ తదితరులున్నారు.

డైరీ ఆవిష్కరణ

జగిత్యాలజోన్: రాష్ట్ర మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరం–2023 డైరీని ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు చల్ల గంగన్న, ప్రధాన కార్యదర్శి శ్రీపతి శ్రీనివాస్, బుగ్గారం జెడ్పీటీసీ బాదినేని రాజేందర్, పాత్రికేయులు వంగల రమేశ్, పాము సత్యం, బండారి రాజ్‌కుమార్, దీటి అంజయ్య, కాశెట్టి రాంబాబు, సంగి నవీన్, ఎర్రం చందన్ పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ జిల్లా కన్వీనర్‌గా రమేశ్



ధర్మపురి: మహాత్మా జ్యోతిరావుపూలే ఉత్సవ కమిటీ జిల్లా కన్వీనర్‌గా జాజాల రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని నేరెల్ల గ్రామానికి చెందిన బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్ కన్వీనర్‌గా ఎన్నికైన సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

అధికారుల విచారణ

మెట్‌పల్లి(కోరుట్ల): మండలంలోని చౌలమద్ది గ్రామంలో కల్లు విక్రయాలపై ఆంక్షలు విధించిన వ్యవహారంపై ఆదివారం ఎక్సైజ్ అధికారులు విచారణ జరిపారు. గ్రామానికి చెందిన గీత కార్మికులకు, గ్రామ పెద్దలకు ఓ విషయంలో వివాదం నెలకొంది. దీంతో వారి నుంచి కల్లు కొనొద్దని కొన్ని రోజుల క్రితం ఆంక్షలు విధించినట్లు తెలిసింది. ఈ విషయం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన విచారణ జరపాలని స్థానిక ఎక్సైజ్ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఈ మేరకు గ్రామానికి వెళ్లిన అధికారులు సర్పంచ్ లింగారెడ్డితో పాటు గీత కార్మికుల నుంచి వివరాలు సేకరించారు. రెండుమూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా గీతకార్మికులకు అధికారులు తెలిపారు.

వారి ఆచూకీ ఎక్కడ?

- జనవరి నుంచి ఇప్పటి వరకు 72 మిస్సింగ్ కేసులు
- సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తిస్తున్న పోలీసులు
- అయినా కొందరి జాడ మాత్రం చిక్కని వైనం
- గత 28 నెలల్లో దొరకని 59 మంది ఆచూకీ



ఏడాది	అదృశ్యం	ఆచూకీ లభ్యం	ఆచూకీ లేని వారు
2021	407	396	11
2022	350	326	25
2023(ఇప్పటివరకు)	72	49	23
మొత్తం	829	770	59

జగిత్యాలక్రైం: వారు ఎక్కడ ఉన్నారో.. ఎలా ఉన్నారో.. ఎందుకు వెళ్లారో.. వారి కోసం కుటుంబ సభ్యులు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నా వారి ఆచూకీ మాత్రం లభ్యం కావడం లేదు. దీంతో బాధిత కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. పోలీసులు కూడా సాంకేతిక పరిజ్ఞానంతో అదృశ్యమైన వారిని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు. కానీ ఇంకొందరి ఆచూకీ మాత్రం దొరకడం లేదు. ఆయా పోలీస్‌స్టేషన్లలో మిస్సింగ్ కేసులు నమోదు చేసిన పోలీసులు వారి వివరాలను కూడా రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లోని పోలీసులకు సమాచారం చేరవేస్తున్నారు.

వివిధ కారణాలతో..

- 2021 సంవత్సరంలో 407 మంది అదృశ్యం కాగా.. 396 మందిని పోలీసులు గుర్తించారు.
- 2022 సంవత్సరంలో పోలీస్ స్టేషన్‌లలో 350 అదృశ్యం కేసులు నమోదు కాగా 325 మంది ఆచూకీ తెలిసింది.
- 2023లో ఇప్పటి వరకు 72 మంది అదృశ్యం కాగా 49 మంది జాడ దొరికింది. కాగా 28 నెలల కాలంలో 59 మంది ఆచూకీ ఇప్పటికీ లభ్యం కావడం లేదు.
- దీంతో వారు ఎలా ఉన్నారో బాధిత కుటుంబాల్లో ఆందోళన నెలకొంది.
- అయితే కొంత మంది యువతీ, యువకులు ప్రేమ పేరుతో, కొందరు అప్పుల బాధ, మరికొందరు వివాహేతర సంబంధాలు, కుటుంబ తగాదాలు, ఇంకొందరు మానసిక రోగాలతో అదృశ్యమవుతున్నారు.
- ఇందులో కొందరు దొరుకుతుండగా, మరికొందురి ఆచూకీ తెలియని వారి కుటుంబ సభ్యులు ఏళ్ల తరబడి రేయింబవళ్లు ఎదురు చూస్తున్నారు.

అదృశ్యమైన వారిని గుర్తిస్తున్నాం



జిల్లాలో వివిధ కారణాలతో చాలా మంది ఇంటి నుంచి వెళ్లిపోతున్నారు. అలాంటి వారు కనిపించడం లేదని ఆయా పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో పోలీసు శాఖ వారి ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించడం జరుగుతుంది. కొంత మంది ఆచూకీ మాత్రం దొరకడం లేదు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానంతో చాలా మందిని గుర్తించి వారి కుటుంబాలకు అప్పగించాం.

– ఎగ్గడి భాస్కర్, ఎస్పీ

సాంకేతిక పరిజ్ఞానంతో..

జిల్లాలో చాలా మంది యువతీ, యువకులతో పాటు వృద్ధులు, బాలికలు, బాలురు, యుక్త వయస్సు వారు కూడా వివిధ కారణాలతో చెప్పాపెట్టకుండా ఇంటి నుంచి వెళ్లిపోతున్నారు. దీంతో అయిన వారంతా వారి ఆచూకీ కోసం వెతికినా దొరక్క, పోవడంతో చివరికి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. పోలీసులు వారి వివరాలను సేకరించి సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా, ఇతర రాష్ట్రాల పోలీసులకు అదృశ్యం అయిన వారి సమాచారం తెలుపుతూ గుర్తించి బాధిత కుటుంబాలకు అప్పగిస్తున్నారు. కాగా జిల్లాలో చాలా మంది యువతీ, యువకులు ప్రేమ పెళ్లి చేసుకుని కుటుంబ సభ్యులకు తెలిస్తే ప్రాణహాని ఉంటుందని, కుటుంబ సభ్యులు నిరాకరిస్తారని ఇంటి నుంచి పారిపోయి ఎక్కడో తల దాచుకుని జీవనం కొనసాగిస్తున్నారు. దీంతో వారు ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానానికి దొరకకపోవడంతో వారి ఆచూకీ కనుగొనడం పోలీసులకు కూడా కష్టతరంగా మారింది.

కాంగ్రెస్, బీజేపీ దొందూదొందే

- సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

మేడిపల్లి(వేములవాడ): కేంద్ర ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరలు పెంచుతూ సామాన్యుని నడ్డి విరుస్తుందని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్, బీజేపీలు దొందూ దొందేనని ఎద్దేవా చేశారు. మండల కేంద్రంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ భవిష్యత్తు కార్యాచరణతో పాటు వచ్చే ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

దేశంలోనే తెలంగాణ నంబర్ వన్

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా ఉందని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ అన్నారు. ప్రతీ కార్యకర్త ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు పెద్ద పీట వేస్తుందన్నారు. అనంతరం మేడిపెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా మంత్రి సమక్షంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, నాయకులు బాపురెడ్డి, మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్

అభివృద్ధిని చూసి ఆదరించండి

వెల్గటూర్(ధర్మపురి): రాష్ట్రంలోని ప్రతీ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించాలని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్‌లో ఆదివారం జరిగిన ఎల్లంపల్లి పునరావాసకాలనీ, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. 53 మందికి ఎల్లంపల్లి పునరావాసం కింద మంజూరైన చెక్కులు, 52 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మొక్కట్రావుపేట గ్రామంలో ఇప్పటివరకు 481 మందికి రూ.14.63 కోట్ల పరిహారం అందించామని వివరించారు. అలాగే సీఎంఆర్ఎఫ్ కింద ధర్మపురి నియోజకవర్గంలో 26 వేల మందికి లబ్ధి చేకూరిందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, జెడ్పీటీసీ సుధారాణి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే బెల్ట్‌లు ప్రదానం

జగిత్యాలటౌన్: పట్టణంలోని సన్‌రైస్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. జిల్లా తైక్వాండో అధ్యక్షుడు గంగారాం వద్ద శిక్షణ పొందిన 25మంది విద్యార్థులకు వివిధ రకాల బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి యోగా శిక్షకుడు కేఎల్‌వీ క్రిష్ణ హాజరై మాట్లాడారు. నేటి కాలంలో పిల్లలు సెల్ ఫోన్‌లకు అలవాడు పడి ఆరోగ్యం పాడుచేసుకోకుండా కరాటే లాంటి ఫిజికల్ యాక్టివిటీస్‌పై శ్రద్ధ చూపాలన్నారు. కరాటే శిక్షణకు తమ పిల్లలను పంపిస్తున్న తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తైక్వాండో చైర్మన్, బెల్ట్ ఎగ్జామినర్‌గా శ్రీగందె సంతోష్, కోచ్‌లు షోయబ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లతో విద్యార్థులు

శ్రీమద్భాగవత బోధనలు



కోరుట్లటౌన్: పట్టణంలోని పురాతన శ్రీమహాదేవస్వామి ఆలయంలో డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన శ్రీవాసవి కల్యాణ భవనంలో శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచనాలు చేశారు.



ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం

- జిల్లాలో 419 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక
- వారం రోజుల్లో ప్రారంభించేందుకు సన్నాహాలు



జగిత్యాల మండలంలో కోతకు వచ్చిన వరి

జగిత్యాలఅగ్రికల్చర్: యాసంగిలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగా సన్నద్ధమవుతోంది. మరో వారం రోజుల్లో వరి పంట చేతికి రానున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలను ఈనెల మూడో వారం నుంచి ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఐకేపీ, సింగిల్ విండో కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే ధాన్యం సేకరించి, ఎప్పటి మాదిరిగానే రైస్‌మిల్లులకు తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే కలెక్టర్ యాస్మిన్‌బాషా, అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశాలు నిర్వహించి జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు.

సింగిల్‌విండో, ఐకేపీ ఆధ్వర్యంలో..

జిల్లాలో 419 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. సింగిల్ విండోల ద్వారా 275, ఐకేపీ ద్వారా 144 కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. రైతులు, ప్రజాప్రతినిధుల డిమాండ్‌ను బట్టి జిల్లాలో అవసరమైన చోట మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు గ్రేడ్–ఏ రకానికి రూ.2,060, కామన్ రకం రూ.2,040 చొప్పున రైతుల నుంచి ధాన్యం సేకరించనున్నారు.

5.31లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యం

వరి సాగుపై ఎలాంటి ఆంక్షలు లేవని ప్రభుత్వం ప్రకటించడంతో ఈ యాసంగిలో జిల్లా రైతులు 2.95 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోలు చేసే ఐఆర్–64, బతుకమ్మ, జగిత్యాల రైస్–1 వంటి దొడ్డు రకాల ధాన్యాన్నే దాదాపు 90 శాతం మంది రైతులు వేశారు. ఈ మేరకు జిల్లాలో దొడ్డు ధాన్యం 5.31 లక్షల మె.ట వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎస్సారెస్పీ నీరు, వరద కాల్వ నీరు, వ్యవసాయ బావులు, బోర్లలో భూగర్భజలాలు నిండుగా ఉండటంతో రైతులు ఆరుతడి పంటలను వదిలి వరి వైపే మొగ్గు చూపారు. కాగా ఈసారి ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తెగుళ్ల విజృంభణ ఎక్కువగా ఉండటంతో ఎకరాకు 18 క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

ఎప్పటికప్పుడు పర్యవేక్షణ..

ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికారులతో పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. కొనుగోళ్లకు అవసరమైన గోనె సంచులు, కాంటాలు అందుబాటులో ఉంచుకోవాలని, రైస్‌మిల్లుల అలాట్‌మెంట్, రవాణా వంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా యంత్రాంగం సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వ్యవసాయ క్లస్టర్ పరిధిలోని కేంద్రాల్లో నాణ్యతను పరిశీలించే బాధ్యతను ఏఈఓలకు, కొనుగోళ్ల సాఫీగా సాగేందుకు ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారులతో మానిటరింగ్ టీంలు ఏర్పాటు చేయనున్నారు. హమాలీలు, లారీల కొరత రాకుండా ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లుల వద్ద నాణ్యత, లారీల వంటి సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే పరిష్కరించేందుకు జిల్లా కేంద్రంలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయనున్నారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు



ప్రభుత్వ ఆదేశాల మేరకు యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపడుతాం. త్వరలో కేంద్రాలను ప్రారంభిస్తాం. జిల్లా అధికారులతో ఇప్పటికే సమావేశాలు నిర్వహించి అవసరమైన ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం చేశాం. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం. రైతులు నాణ్యత గల ధాన్యం తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలి.

– యాస్మిన్‌బాషా, కలెక్టర్

క్రీడలతో మానసిక ఉల్లాసం

వెల్గటూర్(ధర్మపురి): క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం పెరుగుతుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఉమ్మడి వెల్గటూర్ మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి తండ్రి తిరుపతిరెడ్డి స్మారకార్థం ఎండపల్లి మండలం కొండాపూర్‌లో నిర్వహించిన ధర్మపురి నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ చివరి రోజు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరయ్యారు. టోర్నమెంట్‌లో గొల్లపల్లి, కొండాపూర్ జట్లు ఫైనల్‌కు అర్హత సాధించగా ఫైనల్లో కొండాపూర్ జట్టుపై గొల్లపల్లి జట్టు విజయం సాధించింది. గొల్లపల్లి జట్టుకు రూ.30 వేలు, కొండాపూర్ జట్టుకు రూ.15 వేలు, ట్రోఫీలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఆటల్లో గెలుపు, ఓటములు సహజమని, ఓడిపోయిన జట్టు కుంగిపోకుండా మరింత కష్టపడి గెలవాలన్నారు. కార్యక్రమంలో కొండాపూర్, వెల్గటూర్, గొల్లపల్లి, కొత్తపేట, పాతగూడూర్ సర్పంచులు తాటిపర్తి రాజవ్వ, మేరుగు మురళిగౌడ్, నిశాంత్‌రెడ్డి, కొమ్ము రాంబాబు, జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు జాడి సుజాత, అనుమాల మంజుల తదితరులు పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న జీవన్‌రెడ్డి, లక్ష్మణ్‌కుమార్


ఘనంగా ఈస్టర్





జగిత్యాలటౌన్: జిల్లావ్యాప్తంగా ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రిష్టియన్లు ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ జీవరత్నం ప్రత్యేక ఈస్టర్ సందేశం అందించారు. యేసుక్రీస్తు పునరుత్థానం లోకానికి మహా గొప్ప దినం అని అన్నారు. అనంతరం మహిళలు ఈస్టర్ భక్తి గీతాలు ఆలపించారు. అలాగే పట్టణంలోని హెబ్రోను, యేసురక్తం మందిరాల్లో జరిగిన వేడుకల్లో క్రైస్తవ మత పెద్దలు విమలనారాయణ, సునంద్, దేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం భవనానికి నిధులు



ప్రొసీడింగ్ కాపీ అందిస్తున్న ఎమ్మెల్యే

రాయికల్(జగిత్యాల): రాయికల్ మండలం ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం భవనానికి ఆదివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ రూ.5లక్షలు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ కాపీని అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అధ్యక్షుడు శేఖంటి శేఖర్, ప్రధాన కార్యదర్శి మచ్చ సందీప్, కోశాధికారి కాయితి సంజీవ్, నాయకులు వెంకటేశ్వర్లు, వాసం గోవర్ధన్, మల్లేశం, ఈదుల లక్ష్మణ్, నరేశ్, గంగాధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

• నాగారంలో వైద్యశిబిరానికి స్పందన


వైద్యురాలిని సన్మానిస్తున్న గ్రామస్తులు

కోనరావుపేట: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ప్రముఖ వైద్యురాలు పి.లీలా శిరీష అన్నారు. మండలంలోని నాగారంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించి మహిళలకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేసి మాట్లాడుతూ.. మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని, ఆరోగ్య సమస్యల నుంచి బయటపడేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని సూ చించారు. ఎలాంటి సమస్య వచ్చినా ఆస్పత్రి కివస్తే చికిత్స అందిస్తామన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నా మన్నారు. డాక్టర్ శ్రీనాథ్ మహంకాళి, డాక్టర్ హేమలత వైద్యసేవలు అందించారు. సుమారు 300 మందికి పరీక్షలు చేసి మందులు అందించిన వైద్యులను గ్రామస్తులు, పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాస లావణ్య శ్రీనివాస్, వాటర్ కమిటీ చైర్మన్ దుంపెట నాగరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రికి తరలిన ఎల్లారెడ్డిపేట గ్రామస్తులు


యాదాద్రి దర్శనానికి తరలివెళ్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మేజర్ ప ంచాయతీ సర్పంచ్ నేవూరి వెంకటరెడ్డి ఆదివా రం 30 బస్సులలో 1,500 మంది గ్రామస్తుల ను తన సొంత ఖర్చుతో యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి తీసుకెళ్లారు. దైవదర్శనం చేసుకున్న గ్రామస్తులు ఆలయ నిర్మాణాన్ని చూసి సంబురపడ్డారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తులు సుఖసంతోషాలతో ఉండాలని యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని వేడుకున్నట్లు తెలిపారు. అందరికి అల్పాహారంతోపాటు యదాద్రిలోనే భోజన వసతి కల్పించారు.

పత్తి రైతుకు విత్తన భారం

• జిల్లా రైతాంగానికి రూ.అరకోటికి పైగా అదనపు భారం
• జిల్లాలో 58,650 వేల ఎకరాలకు పైగా పత్తి సాగు అంచనా
• పెరిగిన ఎరువులు, ఇంధన ధరల భారంతో అన్నదాత సతమతం
• పత్తి విత్తనాల ధరలు పెంచి, గిట్టుబాటు ధర ఊసెత్తని ప్రభుత్వాలు




పత్తి విత్తన ప్యాకెట్లు

చందుర్తి (వేములవాడ): పత్తి సాగుచేసే రైతులకు విత్తన ధర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సాగుకు ముందే ధర ఖరారు చేయడంతో రైతునెత్తిన మరో పిడుగు పడినట్లైంది. మార్కెట్‌లో 450 గ్రాముల పత్తి ప్యాకెట్ ధర రూ.810 ఉండగా ప్రస్తుతం రూ.853కు చేరింది. దీంతో జిల్లాలోని రైతాంగంపై అదనంగా రూ.అరకోటికి పైగా భారం పడుతోంది. ప్రతియేటా పంట సాగు సమయంలో అతివృష్టి , అనావృష్టి అన్నదాతను వెంటాడడంతో విత్తనాలు రెండుసార్లు వేసే పరిస్థితి నెలకొనడంతో విత్తనాల ఖర్చు తడిసి మోపెడవుతోంది. జిల్లాలోని 2.18 లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు. ఇందులో వరి 1.45 లక్షల ఎకరాల్లో సాగుచేస్తుండగా , రెండో పంటకు పత్తిని 58,650 వేల ఎకరాల్లో వేస్తున్నారు. మిగితా 17వేల ఎకరాల్లో ఇతర పంటలు మొక్కజొన్న, కందులు, ఇతర పంటలు సాగుచేస్తున్నారు. పత్తివిత్తనాల ధర పెరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

• **గిట్టుబాటు ధర అంతమాత్రంగానే .....**

పత్తి రైతులను మూడేళ్లుగా అధిక వర్షాలు వెంటాడుతున్నాయి. దీంతో పంటకు తెగుళ్లు సోకడంతో వాటి నివారణకు విచ్చలవిడిగా క్రిమిసంహారక మందుల వాడేందుకు వెచ్చించే వ్యయం రెండింతలు పెరిగింది. అధిక వర్షాలతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఎకరాకు 8 క్వింటాళ్ల నుంచి 15 క్వింటాళ్ల వరకు వచ్చే దిగుబడి తగ్గింది. ఎకరాకు 6 క్వింటాళ్ల నుంచి 7 క్వింటాళ్ల వరకే దిగుబడి రావడంతో రైతులకు పెట్టుబడి చేతికందడం లేదని రైతులు వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరను వందల్లో మాత్రమే పెంచుతోంది. ప్రస్తుతం సీసీఐ కొనుగోలు ధర గరిష్ఠంగా రూ.6,380గా ఉంది, బహిరంగ మార్కెట్‌లో మాత్రం రూ. 7వేల నుంచి రూ.8వేల వరకు పలుకుతోంది. పత్తికి కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడం లేదన్న ఆరోపణలు రైతులు చేస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా గిట్టుబాటు ధర కల్పిస్తే పంటల సాగులో ఆర్థికంగా దివాళా తీయకుండా ఉంటారన్న ధీమాను రైతులు వ్యక్తం చేస్తున్నారు.

• **పెరిగిన ఎరువుల ధరలు.... ఇంధన ఖర్చులు**

రైతులకు విత్తన ధరతో పాటు గతేడాది ఎరువుల ధరపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని తగ్గించడంతో కాంప్లెక్స్ ఎరువుల ధరలు ఏకంగా రూ.360 నుంచి రూ.700ల వరకు పెరిగాయి. దీంతో జిల్లావ్యాప్తంగా ఎరువుల భారం రూ.1.85 కోట్లు దాటింది. రైతులు పండించే పంటలకు ధరలు పెంచుతూ వారికి ఆశించిన మేర గిట్టు బాటు ధర కల్పించకపోవడంతో రైతులు పంటల సాగును భారంగా భావిస్తున్నారు. ఈ యేడాది పత్తి ధరను క్వింటాల్‌కు రూ. 310 పెంచి చేతులు దులుపుకున్నారు. అయినప్పటికీ ఎరువుల ధరతో పాటు ఇంధన ధరలు పెరగడంతో వ్యవసాయంలో యంత్రాల వినియోగానికి ఇంధన ఖర్చు తడిసిమోపడవుతోంది. దీంతో రైతులు పంటలు సాగుచేయాలంటే విత్తనాలు, కూలీలు, ఎరువులు, ఇంధన ధరలన్నీ రైతుల పాలిట శాపంగా మారాయి.

• **లూజ్ పత్తి విత్తనాల వైపు రైతుల చూపు**

కేంద్ర ప్రభుత్వం పత్తివిత్తనాల ధర పెంచడంతో రైతులు లూజ్ పత్తి విత్తనాలు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. కొందరు రైతుల బలహీనతను ఆసరాగా చేసుకున్న వ్యాపారులు లూజ్ పత్తి విత్తనాలను ఆంధ్రనుంచి తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. అంతేకాకుండా గతంలో నకిలీ విత్తనాలు అమ్ముతు పట్టుబడిన ఎంతోమంది వ్యాపారులపై జిల్లావ్యాప్తంగా కేసులు నమోదుచేసిన ఘటనలు ఉన్నాయి. ఈ సారి కూడా పత్తివిత్తనాల వ్యాపారం జోరుగా సాగుతోందని ప్రచారం. లూజ్ పత్తి విత్తనాలు కిలోకు రూ.550 నుంచి రూ.700 ధరకు విక్రయిస్తుండడంతో వీటిపైనే రైతులు దృష్టి సారిస్తున్నారు. ఎకరా పత్తి విత్తనాలకు ప్యాకెట్ కొనుగోలు చేస్తే రూ.2,559 ఖర్చు అవుతోందని విత్తన భారం సగానికి సగం తగ్గుతుందనే రైతులు భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే వ్యవసాయాధికారుల కళ్లుగప్పి బీటీ 3 పత్తి విత్తనాలను సాగు చేస్తున్నారని తెలిసింది.

ఎరువులు, పత్తి విత్తనాలపై సబ్సిడీ పెంచాలి



రైతులకు సాగు ఖర్చులు ఏటా పెరుగుతున్నాయి. దీనికి తోడు కేంద్రం సబ్సిడీలను తగ్గించడంతో ఎరువుల ధరలు పెరిగాయి. దీంతో మూలిగే నక్కపై తాటిపండు పడినట్లైంది. సబ్సిడీ పెంచడం చేతకాకపోతే కనీసం పండించిన పంటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలు పెంచి ఆదుకోవాలి. లేకుంటే రైతులు ఆర్థికంగా నష్టపోతారు.

– తాడిశెట్టి తిరుపతిరెడ్డి, రైతుసంఘం అధ్యక్షుడు, బందపల్లి

డిగ్రీ కళాశాల హామీ నెరవేర్చాలి


మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుపై మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ కోరారు. ఎల్లారెడ్డిపేటలో ఆదివారం మాట్లాడుతూ.. స్థానికంగా డిగ్రీ కళాశాల లేక నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. ఏటా 1,500 మంది ఇంటర్ ఉత్తీర్ణులు అవుతున్నప్పటికీ సగంకూడా ఉన్నత విద్యకు నోచుకోలేకపోతున్నారన్నారు. కళాశాల కోసం అనేకసార్లు విద్యార్థులతో కలిసి పోరాటాలు చేస్తే మంత్రి కళాశాల ఏర్పాటుకు హామీ ఇచ్చారన్నారు. సోమవారం మండల పర్యటనకు వస్తున్న మంత్రి డిగ్రీ కాలేజీపై స్పష్టత ఇవ్వాలని కోరారు. లేకుంటే అడ్డుకుంటామని హెచ్చరించారు.

మొదలైన బీరప్ప కామరాతి ఉత్సవాలు


విన్యాసం చేస్తున్న ఒగ్గుదోలు కళాకారులు

కోనరావుపేట: మండలంలోని మర్తనపేటలో బీరప్ప కామరాతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం లింగాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాకారుల విన్యాసాల మధ్య ఊరేగింపుగా వెళ్లి కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ వంశీకృష్ణ రావు, ఆద్యా ఫౌండేషన్ చైర్మన్ గోలిమోహన్, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఊరూ వాడా అంతా బలగమే


బలగం సినిమా చూస్తున్న జనం


నారాయణపూర్‌లో సినిమా చూస్తున్న గ్రామస్తులు

వేములవాడ/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అత్యధికంగా జనాధరణ పొందుతున్న బలగం సినిమా చూసేందుకు ఊరూ... వాడా అంతా ఏకమవుతున్నారు. ఊర్లు, పట్టణాల్లో డప్పుచాటింపులు వేయిస్తూ అంతా ఒకేచోట చేరి ఓపెన్ థియేటర్లలో చల్లని వాతావరణంలో బలగం సినిమాచూస్తూ ఆస్వాధిస్తున్నారు. వేములవాడ పట్టణం, అర్బన్ మండలం, రూరల్ మండలం, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట, బోయిన్‌పల్లి మండలాల్లోని ఆయాగ్రామాల్లో పెద్దఎత్తున జనం ఒకేచోట చేరి గతంలో ప్రొజెక్టర్లతో సినిమాలు చూసిన విధంగా గతాన్ని గుర్తు చేసుకుంటూ ఆనందం వ్యక్తంచేశారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణాపూర్, బండలింగంపల్లి గ్రామాల్లో ఆదివారం రాత్రి బలగం సినిమా ప్రదర్శించారు. ఆద్యంతం సినిమా చూస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. సినిమా చూస్తున్నంతాసేపు బంధాలు, బంధుత్వాలపై, ఆనాటి పరిస్థితితులను తలుచుకుంటూ.. దుఖంలో మునిగారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యస్థాపనకు పోరాటం

• నాలుగు గ్రామాల్లో డీఎస్పీ పాదయాత్ర


బోయినపల్లిలో దళిత్ శక్తి ప్రోగ్రాం పాదయాత్ర

బోయినపల్లి(చొప్పదండి): రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యస్థాపనకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని దళిత్ శక్తి ప్రోగ్రాం(డీఎస్పీ) జిల్లా ఉపాధ్యక్షుడు ఎడపెల్లి బాబు పేర్కొన్నారు. దళిత్‌శక్తి ప్రోగ్రాం వ్యవస్థాపకుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టిన 10వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్రకు సంఘీభావంగా ఆదివారం మండలంలోని కోరెం, అనంతపల్లి, బూర్గుపల్లి, బోయినపల్లి గ్రామాల మీదుగా 10 కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ.. గతేడాది మార్చి 15న ప్రారంభమైన పాదయాత్ర అన్ని జిల్లాలు తిరుగుతూ ఇప్పటికీ 9,500 కిలోమీటర్లు విజయవంతంగా పూర్తిచేశారని.. త్వరలో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఉల్లెందుల అరుణ్, కట్కూరి బాలరాజు, డీఎస్పీ ప్రోగ్రాం మండల అధ్యక్షుడు కొమ్ము విక్రమ్, ప్రతినిధులు కుర్మ సురేశ్, కుడుకల మధు, గిరిబాబు, కుర్మ సంజీవ్, వంశీ, బూర్గు విజయ్, ప్రసాద్, రామంచ పర్శరామ్ తదితరులు పాల్గొన్నారు.

నీలోజిపల్లిలో పట్టపగలు చోరీ

• బంగారు నగలు, వెండి అపహరణ


చోరీ ప్రదేశంలో ఫింగర్‌ప్రింట్స్ సేకరిస్తున్న బృందం


సీసీ కెమెరాలో రికార్డయిన కారు

బోయినపల్లి(చొప్పదండి): రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం నీలోజిపల్లి పునరావాసకాలనీకి చెందిన అనుముల మహేందర్ ఇంట్లో ఆదివారం పట్టపగలు చోరీకి పాల్పడ్డారు. నాలుగు తులాల బంగారు నగలు, పట్టగొలుసులు అపహరణకు గురయ్యాయి. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం వివరాలు. మహేందర్ కుటుంబ సభ్యులు ఆదివారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దొంగలు తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాను తెరిచి 4 తులాల బంగారు నగలు, పట్టగొలుసులను ఎత్తుకెళ్లారు. బీరువాలో ఉన్న బట్టలు చిందర వందర చేశారు. మహేందర్ ఇంటికొచ్చి చూసేసరికి బీరువా తెరిచి ఉంది. బంగారు నగలు, పట్టగొలుసులు కనిపించలేవు. ఎస్సై మహేందర్, ఏఎస్సై చంద్రమౌళి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీమ్, ఫింగర్‌ప్రింట్స్ సేకరించే బృందం పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. చోరీ జరిగిన అనంతరం ఇంటి ముందు నుంచి ఓ కారు వెళ్లడం సీసీ కెమెరాలో రికార్డయినట్లు భావిస్తున్నారు.

ప్రభుత్వ అసమర్థత వల్లే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్


ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న రాజమ్మ

వెల్గటూర్: రాష్ట్రప్రభుత్వం అసమర్థత వల్లే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకైందని వైఎస్సార్‌టీపీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి మోకెనపెల్లి రాజమ్మ అన్నారు. వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల ఆదేశాలతో సేవ్‌తెలంగాణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేట చౌరస్తా వద్ద ప్రభుత్వవైఫల్యాలు, విద్యార్థులు, నిరుద్యోగులకు రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయంపై నిరసనగా ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా రాజమ్మ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకైందని దీంతో 30 లక్షల మంది విద్యార్థులు, నిరుద్యోగులు రోడ్డున పడ్డారన్నారు. పేపర్ లీక్ అంశాన్ని సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, టీఎస్‌పీఎస్సీ బోర్డు ప్రక్షాళన చేయాలని, నిరుద్యోగులకు రూ.3,016 నిరుద్యోగభృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో రానున్నది రాజన్న రాజ్యమేనని, తెలంగాణ ప్రజలు షర్మిలమ్మను ఆశీర్వదిస్తారని రాజమ్మ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


తోకల నవీన్(ఫైల్)

కోరుట్లరూరల్: మండలంలోని పైడిమడుగు గ్రామంలో విద్యుత్‌షాక్‌కు గురై తోకల నవీన్(33) యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. నవీన్ గతంలో ఉపాధి నిమిత్తం గల్ఫ్‌వెళ్లి వచ్చాడు. గ్రామంలోనే ఎలక్ట్రీకల్ పనిచేస్తూ స్థిరపడ్డాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అదేగ్రామంలోని ఓ ఇంట్లో కూలర్ రిపేర్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు కోరుట్ల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. నవీన్‌కు భార్య, రెండేళ్ల కూతురు, తల్లి, తండ్రి ఉన్నారు. నవీన్ మృతితో గ్రామంలో విశాదం నెలకింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఇల్లంతకుంట: మండలంలోని రహీంఖాన్‌పేట శివారులో ఆదివారం సాయంత్రం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. తంగళ్లపల్లి పద్మనగర్‌కు చెందిన దొంతుల అరుణ్, బండి సాకేత్, అదే మండలంలోని చీర్లవంచకు చెందిన గండి అక్షయ్ ముగ్గురు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా బైక్‌పై వస్తున్న సురేశ్ అనే యువకుడు ఢీకొట్టడంతో సురేశ, అరుణ్, అక్షయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సాకేత్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. తీవ్ర గాయాలైన ముగ్గురిని పోలీసులు, స్థానికులు ప్రైవేట్ అంబులెన్స్‌లో కరీంనగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తంగళ్లపల్లి, చీర్లవంచ గ్రామానికి చెందిన ముగ్గురు 9,10 తరగతి చదువుతున్నట్లు తెలుస్తోంది. ఎస్సై రాజేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి..

ఒకరి పరిస్థితి విషమం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ తరలించారు. ముస్తాబాద్ మండలం రాంరెడ్డిపల్లికి చెందిన శివరాత్రి బలరామ్, నవీన్ బైక్‌పై రాచర్లగొల్లపల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా.. ఎల్లారెడ్డిపేట నుంచి గొల్లపల్లికి మరో బైక్‌పై స్థానిక యువకులు మహేందర్, రాములు వెళ్తున్న బైక్ ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో నవీన్, రాములు గాయపడ్డారు. ఇందులో నవీన్ పరిస్థితి విషమంగా మారింది.స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ తరలించారు.

బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య


ప్రభాకర్ (ఫైల్)

జగిత్యాలక్రైం: బైక్ కొనివ్వలేదని ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌కు చెందిన రాజుల ప్రభాకర్(28) యువకుడు కూలీపనులు చేస్తూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా బైక్ కావాలని కుటుంబ సభ్యులను కోరగా వారు కొనిచ్చేందుకు నిరాకరించారు. దీంతో మనస్థాపం చెందిన ప్రభాకర్ ఈనెల 7న గ్రామశివారులోని మామిడి తోటలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు జగిత్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తల్లి లక్ష్మీఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.

తంగళ్లపల్లి మండలమేనా..!?


తంగళ్లపల్లిలో వెలసిన పోస్టర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అమాత్య ఎందుకు మాపై వివక్ష.. మాది తంగళ్లపల్లి మండలమా? లేక గ్రామమా? అంటూ మండలకేంద్రంలో పోస్టర్లు వెలిశాయి. సోమవారం మంత్రి కేటీఆర్ పర్యటన తంగళ్లపల్లి మండలంలో ఉండడం ఆదివారం ఈ పోస్టర్లు వెలవడం ఆసక్తి రేకెత్తిస్తోంది. తంగళ్లపల్లి పట్టణ(గ్రామ) పోరాట వేదిక అఖిల పక్షంపేరిట పోస్టర్లు వెలువడగా అందులో పేర్లు లేకుండా ఆరుగురి ఫోన్‌నంబర్లను సైతం ముద్రించారు. తంగళ్లపల్లి మండలం ఏర్పడి ఆరేళ్ల గడుస్తున్నా.. మండలం అభివృద్ధి చేయడం లేదని తహసీల్దార్ కార్యాలయం, బస్టాండ్, రైతులు కళ్లాలకు వెళ్లేందుకు రోడ్లు, నడిరోడ్డులో ఉన్న రాములోరి గుడి తరలింపు, విద్యార్థుల కోసం జూనియర్ కళాశాల ఏర్పాటు, యువకులకు క్రీడామైదనాం, మల మూత్ర విసర్జనకు పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటుచేయలేదని పోస్టర్‌లో ప్రశ్నించారు. తంగళ్లపల్లిని సిరిసిల్ల మున్సిపాలిటీలో కలిపేందుకు కుట్రచేస్తున్నారని అందులో పేర్కొన్నారు. ఈ పోస్టర్లు ఎవరు వేశారు. ఎందుకు వేశారు అనే చర్చ సాగుతోంది.

పోలీసుపై తిరగబడిన మందుబాబు

• డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు

సిరిసిల్లక్రైం: ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఆదివారం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో పోలీసుల మీదకు మందుబాబు తిరగబడిన ఘటన సిరిసిల్ల పాతబస్టాండ్ ఏరియాలో చోటుచేసుకుంది. పాతబస్టాండ్ ఏరియాలో ట్రాఫిక్ ఎస్సై రాజు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా పలువురుని తనిఖీ చేశారు. ఈక్రమంలో ఓ ముందుబాబుకు బ్రీత్ అనలైజర్ చేయడానికి పోలీసులు ప్రయత్నించారు. దీంతో కోపోద్రిక్తుడైన అతడు ఏకంగా పోలీసు అధికారి కాలర్ పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదే విషయాన్ని ట్రాఫిక్ ఎస్సై రాజును వివరణ కోరగా తాగిన మైకంలో అమర్యాద ప్రవర్తించిన వ్యక్తిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదుచేస్తామని, మద్యంమత్తులో సదరు వ్యక్తి పేరును వెల్లడించలేదని ఎస్సై పేర్కొన్నారు.

నిరుద్యోగ యువతకు తోడ్పాటునందిస్తా

• ఆద్య ఫౌండేషన్ చైర్మన్ గోలి మోహన్


మోహన్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

కోనరావుపేట(వేములవాడ): గ్రామీణ ప్రాంతాల్లో ని నిరుద్యోగ యువతకు ఉపాధి అందించేందుకు తోడ్పాటునందిస్తానని ఆద్య గోలి ఫౌండేషన్ చైర్మన్ గోలి మోహన్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్‌లో ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో యువత చాలా మంది ఉన్నారని, వారికి సరైన ఆదాయమార్గాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధిమార్గం చూపెట్టాలని కోరారు. తనవంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో గోలి మోహన్‌ను సన్మానించారు.